# పాపం పుల్లయ్య

"అయ్యో టీచరుగారూ! అమ్మగారు పోయారు." అంటూ భోరున ఏడ్చాడు పుల్లయ్య. ఆ ఏడుపు విని, కంగారుతో ఇక ఏం చేయడానికి పాలుపోక అతని చేతిలో ఒదిగిపోయింది. పాపం ఆ టెలిఫోన్ రిసీవర్. ప్రిన్సిపాల్ టేబిల్ ప్రక్కనున్న కుర్చీలో కూర్చుని ఏవో కాగితాలు చూస్తున్న శారదానాయుడు, ఈ వార్తవిని గాభరాగా ఒక్క ఉదుటున లేచింది. ఫ్యాన్ ఫోన్ సంభాషణ మీద ఏమంత ఆసక్తి లేకపోయినప్పటికీ, ఈ వార్త విన్న వైస్‌ప్రిన్సిపాల్ తల మీద పిడుగు పడ్డట్టయ్యింది. పరుగెత్తుకు వచ్చి, ఫోన్ లాక్కుని, ఆదుర్దాగా "ఎన్ని గంటలకి" అని అడిగింది.

"తెల్లారి అయిదున్నర గంటలకు...."

"ఏం గుండెపోటా?"

అవతలినుంచి, "కావచ్చు."

"మాకందరికి ఇది పెద్ద షాక్. కాస్సేపట్లో మేమంతా అక్కడుంటాము." అని ఆ స్త్రీ ఫోన్‌పెట్టేసి, గబగబా స్టాఫ్ రూమ్‌వైపు వెళ్ళింది.

క్లాస్‌రూమ్‌లో పాఠాలు చెబుతున్న టీచర్లందరినీ వెంటనే స్టాఫ్‌రూమ్‌కి వచ్చేయవలసిందిగా మారథాన్‌రన్‌తో పుల్లయ్య సందేశంతో కూడిన నిర్దేశాలందించాడు. గద్గదకంఠంతో శారదానాయుడు, టీచర్లందరికీ ఆ దిగ్భ్రాంతి కలిగించే వార్త తెలిపింది. ఆ వార్తవిని కొంతమంది సహజంగానే చలించారు, కొంతమంది చలించినట్టుగా మొహాలు పెట్టారు. సుఖదుఃఖాల పట్ల సమబావం పెట్టుబడిగా పెట్టుకున్న కొందరు, "ఆమెకు యాభై అయిదు దాటింది కదా! ఈ మధ్యన ఒక అటాక్ వచ్చినట్లుగా కూడా విన్నాము. ఆ విషయాన్ని ఆమె చాలా రహస్యంగా దాచి ఉంచింది. అందుకే ఇది రెండో అటాక్ కావచ్చు." అనే అభిప్రాయం వెలిబుచ్చారు.

ఆరోగ్య విషయాల గురించి మంచి అవగాహన కలిగి ఉన్న ఒక టీచర్... "హార్ట్ అటాక్ అనేది పైకి ఎటువంటి లక్షణాలు కనిపించకుండా కూడా రావచ్చు. దాన్నే సైలెంట్ అటాక్ అంటారు. ఆ విధంగా, మన ప్రిన్సిపాల్ గారికి ఇది మూడో అటాక్ కావచ్చు. సాధారణంగా మూడో అటాక్ ఫాటల్ అవుతుంది." అని తన విజ్ఞానాన్ని అక్కడున్న నలుగురికీ వడ్డించింది.

“ఆ ప్రిన్సిపాల్ గారికి ఎక్కువ బరువుతో పాటు, హైబ్లడ్‌ప్రెషర్, కొలస్ట్రాల్ కూడా వుండేవి కదా! పైగా స్కూలు నడపడం ఏమంత సులభమైన పనికాదు. చాలా టెన్షన్‌తో కూడిన వ్యవహారం.” అని మరొకరు అభిప్రాయాన్ని వెల్లడించారు.

కానీ, ఇటువంటి చర్చా గోష్టులు చేయాల్సిన సందర్భాలు కాదిది. టీచర్లందరూ తమ తమ క్లాసులకు వెళ్ళి విద్యార్థినీ విద్యార్థులకు ఈ విషయాన్ని తెలిపారు. ఆ రోజుని శెలవు రోజుగా ప్రకటించడం వలన, చిన్న క్లాసుల్లోని పిల్లలు సంతోషంతో గెంతులేశారు. కానీ, ఆ సంతోషంతో సగం మరుక్షణంలో ఆవిరైపోయింది. పిల్లలందరూ వెంటనేఇల్లకు వెళ్ళకూడదనీ, అందరూ చనిపోయిన ప్రిన్సిపాల్ ఇంటి ముందు హాజరు కావాలని, టీచర్లు ఆదేశించారు. ఏదయినా, రోడ్డుమీద నాలుగైదు కిలోమీటర్లు నడిచి వెళ్ళడమంటే పిల్లలకు సరదానే.

వైస్ ప్రిన్సిపాల్ శారదానాయుడు, కార్యనిర్వహణలో అందె వేసిన చెయ్యి కావడం వలన తదనంతర కార్యక్రమంలో స్టాఫ్ చెయ్యవలసిన పనుల గురించి, నిర్దేశాలను జారీచేశారు. స్కూల్ బస్సులు రెండూ ఈ విషాద సంఘటనకి కదిలిపోయి భోరున విలపిస్తూ, నగరంలో ఉన్న పూల దుకాణాల నుంచి, పువ్వులు, పూలమాలలు, పుష్పచక్రాలు, పత్రచక్రాలు ఇత్యాది సేకరించుకుని త్వరగా తిరిగివచ్చాయి.

ఎవరో చెప్పిన సలహా మేరకు, నల్లటి గుడ్డ పెద్దది కొని, టీచర్లు దాన్ని చిన్న చిన్న పీలికలుగా కత్తిరించి, పిల్లలందరి షర్టులకు పిన్నుతో గుచ్చారు.

దాదాపు పదకొండున్నర గంటలకు స్కూలునుంచి శోకయాత్ర ప్రారంభమైంది. (స్కూలెక్కడా? ప్రిన్సిపాల్ ఇల్లెక్కడా అని నేను ఇక్కడ చెప్పదలుచుకోలేదు, దానిలోని అంతరార్థం మీకు రాను రాను తెలుస్తుంది).

స్కూలు పిల్లలందరూ ఎంతో క్రమ శిక్షణతో రోడ్డుకి ఒక ప్రక్కలైనుగా నడిచి వెళ్తున్నారు. అయినా కూడా, నాలుగురోడ్ల కూడలిలో, ఆ ఊరేగింపు ట్రాఫిక్‌కు కొంచెం ఆటంకం కలిగించినది. పోలీసు కమిషనర్‌కి ఈ విషయం కాస్త ముందుగా తెలిసి ఉంటే, ఊరేగింపుపై నిషేధాజ్ఞ విధించి ఉండేవారేమో! ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఎవరైనా ప్రిన్సిపాల్ చనిపోదలుచుకుంటే, శెలవుల్లో, శెలవు రోజున మాత్రమే చావాలనే, బ్లాంకెట్ ఆర్డర్ తన మెజిస్ట్రేట్ అధికారాల్ని ఉపయోగించి, కమీషనర్‌గారు ఉత్తర్వులు జారీచేయడానికి, అవకాశముందని, రేపటి డెక్కన్ క్రానికల్‌లో ఒక వార్త రావచ్చేమో!

ఇంతమంది పిల్లలూ ఇలా రోడ్డుమీద నడవం చూసినా కొందరికి కారణం

తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది. పిల్లలు నల్ల బాడ్జీలు ధరించి ఉండటం చూసి, జాతీయ పతాకాన్ని కూడా అవనతం చేసి ఉంటారని ఊహించారు. పిల్లలని, టీచర్లని అడిగి విషయాన్ని తెలుసుకొన్న కొంతమందికి తీవ్ర నిరాశ కలిగింది. ఒక మామూలు స్కూలు ప్రిన్సిపాల్ చనిపోతే, ఆ వార్తకి ఏమంత ప్రాధాన్యత ఉండదు. ఫలానా స్కూల్‌లో పిల్లలకి అడ్మిషన్ దొరకక వెనక్కి తిరిగి వెళ్తున్న తల్లిదండ్రులకి, ఆ స్కూల్ ప్రిన్సిపాల్‌ని చంపాలన్నంత కోపం వస్తుంది గానీ, తమ పిల్లల్ని వేరొక స్కూల్లో చేర్పించిన తరువాత, ఆ కోపం కాలక్రమాన చనిపోతుంది. ఏదయినా స్కూలు ప్రిన్సిపాల్ చనిపోయారని వింటే, మామూలుగా ఎవరైనా, ఆ వ్యక్తిపేరు గానీ, వయసు గానీ, చనిపోవడానికి గల కారణాలు కానీ అడిగి తెలుసుకోవడానికి ప్రయత్నించరు కానీ, ఈ విషయాల పట్ల కూడా ఎక్కువ వివరాలు సేకరించడానికి ఆసక్తి ఉన్న కొందరుంటారు. ఆ వర్గానికి నాలుగో ఎస్టేట్ అని కొందరు పిలిచేటపుడు, మొదటి మూడు ఎస్టేట్లలో వాళ్ళు ఎందుకు ప్రవేశించలేకపోయారని మంచి మనస్సున్న కొంతమంది ఆలోచించకుండా ఉండరు. ఈ వార్తల వేటగాళ్ళు ఒక స్కూలు ప్రిన్సిపాల్ చనిపోయారనే విషయం వింటే చాలదు. చనిపోయిన ప్రిన్సిపాల్ ఒక స్త్రీ అని తెలియగానే, వాళ్ళకు మొదట వచ్చే అనుమానం ఆమెను ఎందుకు హత్య చేసారని? రెండో అనుమానం ఆమె ఎందుకు ఆత్మహత్య చేసుకుందని? అది హత్య అయినా గానీ, ఆత్మహత్య అయినా గానీ, దానికి మూలకారణం ఆమె భర్తకు ఆ ఇంట్లో ఒక పనిమనిషితో గానీ, లేక ఆ స్కూల్లో ఒక అందమైన పంతులమ్మతో కానీ దీర్ఘకాలిక అక్రమ సంబంధం ఉండి ఉంటుందని ఆ అనుమాన నిపుణులు అనుకుంటారు. మృగ భర్తృత్వ నిర్దేశకుడిని కుక్క కరిచిందని వినగానే, చతుష్పాదుల క్షేమం కొరకు నెలకొల్పబడిన ఒక విభాగపు అధిపతికి అకారణంగా, ఏ ఒక్క శునకము కూడా దంతక్షతమనే కానుక ప్రసాదించదనీ స్వయంశునాశీరుడని అభిమానించే ఆ ఉన్నతాధికారి శ్వానమాసం రుచి ఏమిటని తెలుసుకోవడానికి ప్రయత్నించి ఉంటాడని, అందుకే, ఆత్మరోణ కొరకు ఆ సారమేయం సారమైన ఎదురుకాటు వేసి ఉంటుందని నిర్ణయించేవాళ్ళే కదా వీళ్ళు. అలాంటి వాళ్ళు కొంతమంది ఆ ఊరేగింపుతో వెళ్ళి ఉంటారు. వారిలో ఒకరిద్దరికి దగ్గర సెల్‌ఫోన్ అనే మనశ్శాంతి నాశకోపకరణం ఉండటం వలన, వారు తమ తమ ఫోటోగ్రాఫర్లను ఉన్నపళంగా వచ్చేయమని నిర్దేశాలు ఇచ్చి ఉంటారని ప్రత్యేకంగా ప్రస్తావించనక్కరలేదు కదా!

వారు గమ్యస్థానం చేరేటప్పటికి, వారికి స్వాగతం పలకడానికి సాక్షాత్తూ ప్రిన్సిపాల్‌గారే బయట నిలబడి ఉన్నారు. పిల్లల ఊరేగింపు ముందున్న శారదానాయుడు, ప్రిన్సిపాల్‌ని చూసి ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెడితే, పిల్లలందర్నీ చూసి, ప్రిన్సిపాలమ్మగారు తన నోటి విస్తారం తెలియనివ్వకుండా చేతితో మూసి ఉంచారు.

“ఏమిటి శారదా! ఏకంగా స్కూలునే తరలించుకుని వచ్చావు? ఏమవసరం?” అని ఆమె అడిగేటప్పుడు, తన తడబాటును తెలియనివ్వకుండా,

“అదేమన్న మాట మేడమ్! మీ మదరొకటి, మా మదరొకటీనా? అంతేకాదు, ఈ పిల్లలకి మీ అమ్మగారు, అమ్మమ్మతో సమానం.” అని తన సమయస్ఫూర్తిని ప్రదర్శించింది. మనుష్యులు నిలదొక్కుకునే శక్తి గురించి ఆలోచించినపుడు, మనమందరం సర్వసృష్టికర్తయైన బ్రహ్మయ్యకు ఋణపడి ఉండవలసిందే. ఆయన ఎంత చక్కటి ముందుచూపుతో మన శరీర నిర్మాణాన్ని రూపొందించాడు. ఈ శరీరం నిలకడ కోసం దాదాపు అన్ని బాహ్యాంగాలు జతలు జతలుగా సృష్టించి, వాటిని కుడి ఎడమల్లో సమానంగా ఏర్పరచి, జతగా ఇవ్వడానికి వీల్లేని భాగాల్ని శరీర మధ్య భాగాల్లో ఉంచే వారు ఎంత గొప్ప స్ట్రక్చరల్ ఇంజనీర్!

ముందున్న మిగతా టీచర్లు ఏం మాట్లాడాలో తోచక అలా నిలబడుంటే, పిల్లల్లో కొంతమంది గుట్టు రట్టు చేశారు.

“అయ్యయ్యో! ప్రిన్సిపాల్ మేడమ్ చనిపోలేదే!” అని ఆశ్చర్యంగా అరుస్తుంటే, ఇంకాస్త తెలివితేటలున్న పిల్లలు, “లాంగ్‌లివ్ అవర్ ప్రిన్సిపాల్ మేడమ్” అనే నినాదాలు చేశారు. ఆ క్షణంలో, ఛస్తే మేలా? బ్రతికితే మేలా? అనే క్విజ్ ప్రశ్నకు అయిదంకెలు లెక్కపట్టేలోగా, “వచ్చే వరకూ బ్రతికి ఉంటా” అనే జవాబుకి ఆమె సిద్ధమైంది.

ఎలాంటి పరిస్థితులనైనా ధైర్యంగా, స్థైర్యంగా, ఎదుర్కొనే శిక్షణని విద్యార్థినీ, విద్యార్థులకు ఇచ్చే అధ్యాపక బృందానికి, ఆ సందర్భములో, “కింకరణీయం” అని ఎక్కువగా ఆలోచిస్తూ నిలబడే అవసరం రాలేదు. బస్సుల్లో తీసుకువచ్చిన పుష్పచక్రాలలో నుంచి మూడింటితో అలంకృతమయ్యే అదృష్టం ఆ మృతదేహానికి కలిగింది. రెండు పూల బుట్టలని శారదానాయుడు, ప్రిన్సిపాల్ చేతికి ఇచ్చింది.

శారదానాయుడు, మరో ఇద్దరు టీచర్లు ఆ సంకట పరిస్థితికి కారణభూతుడైన పుల్లయ్య, అక్కడే ఉండిపోయారు. ఇతర అధ్యాపకుల నేతృత్వంలో పిల్లలు స్కూలుకు తిరిగి వెడుతుండగా, కొంతమంది పిల్లలు...

“అయ్యో ప్రిన్సిపాల్ మేడమ్ చనిపోకపోవడం వలన, స్కూలుకు శెలవు ఉంటుందో లేదో,” అని శబ్దాయమానంగా ఆలోచిస్తూ ఉండగా, “ఏమీ భయపడకండి, స్కూలుకు వెళ్ళిన తరువాత మీరు ఇంటికి వెళ్ళిపోవచ్చు.” అని చెప్పి కొంతమంది టీచర్లు వాళ్ళకి ఉల్లాసం కలిగించారు.

రెండు బస్సుల్లో మిగిలున్న పుష్పచక్రాలనీ, పువ్వులనీ తిరిగి దుకాణం వాళ్ళకు ఇచ్చేసి,

కొంతవరకూ ధననష్టం పూడ్చుకోవడానికి ప్రయత్నించిన ఇద్దరు టీచర్లకు మొఖం పగిలినంత పనయ్యింది.

"మీకు కావలసిన వాళ్ళెవరో చనిపోయారని చెప్పి మీరు ఈ పూవులన్నిటినీ తీసుకువెళ్ళారు. వాటిని ఇలా తిరిగి తీసుకురావడంలో అర్థమేమిటి? చావబోతున్నారని కానీ, చచ్చిపోయారని కానీ, మీరనుకున్న మనిషి ఇపుడు చావడం ఇష్టం లేదని అన్నారా?"

"అది కాదు, మరి... మరి..." అని ఒక టీచరు తటపటాయిస్తు ఏదో చెప్పబోతే,

"ఏమనుకుని మీరు వీటన్నింటినీ తిరిగి తీసుకు వచ్చారు? వీటిని మేము తిరిగి తీసుకుంటే, డబ్బు, హోదా గల ఏ వ్యక్తినో మేము వెళ్ళి చంపాలా? అటువంటి సత్కార్యమేదయినా చేస్తే పోలీసులు పట్టుకుంటారు. అందుకే, ఆపనేదో మీరే చేసి పెడతామంటే, వీటన్నింటినీ మేము తిరిగి తీసుకుంటాము."

"అదీ..... అదేమిటంటే, .... చనిపోయినది, మేము అనుకున్న వ్యక్తి కాదు." అని ఆత్మరక్షణ కొరకు పాపం, ఆ పంతులమ్మ ప్రయత్నించింది.

కానీ, శతఘ్ని ముందు, వడిసెల ఏం పనికొస్తుంది?

"మీరు అనుకున్న వాళ్ళంతా చనిపోవాలని ఉందా? అలా అయితే మీ ఉద్దేశ్యాలు మంచివి కావు. ఎవరయినా చనిపోయిన తరువాత కదా పుష్పచక్రాలు కొంటారు."

"మీరు చెప్పినది కరక్టేనండి. మాకు ఒక చిన్న మిస్టేక్ జరిగింది. చనిపోయినది, కూతురనుకుని మేము ఈ పుష్పచక్రాలన్నీ కొన్నాము. కానీ, నిజానికి చనిపోయినది తల్లి." అని ఆ అధ్యాపిక విశదీకరించింది.

"మీరెంత క్రూర హృదయులు! తల్లి బ్రతికుండగా కూతురు చనిపోవాలని కోరుకుంటారా? చావుకు కూడా సీనియారిటీ చూడద్దనా మీ అభిప్రాయం?"

"అది కాదండి. చనిపోయిన ఆ తల్లి మృతదేహం మీద మేము మూడు పుష్పచక్రాలని ఉంచాము. ఇంకా ఎక్కువ అక్కడ అనవసరమని వీటిని తిరిగి తీసుకువచ్చాము."

"ఓ టీచరమ్మా! ఒక్క విషయం మీరు అర్థం చేసుకోవాలి. మేము పళ్ళు గానీ, కాయగూరలు కానీ, అమ్మితే అవి మీరు తిరిగి తీసుకువచ్చినా మేము తీసుకునే వాళ్ళం. ఎందుకంటే, అవి ఇంకెవరయినా తింటారు. కానీ, ఇవి కొనుక్కోవడానికి ఎవరు వస్తారు? సరే, రేపు అమ్ముకోవచ్చంటే వీటిని ఫ్రిజ్‌లో పెట్టడానికి వీలుందా? ఇంకో విషయం, ఇవి మృతదేహాలకి తప్ప, మరిదేనికీపనికిరావు.

"అయితే, మరి.... వీటిని... మేమేం చేసుకోవాలి?" అని ఒక టీచరు సందేహిస్తూ, సందేహిస్తూ అడగకుండా ఉండలేకపోయింది.

"ఓ పంతులమ్మలూ! మీరు ఇద్దరున్నారు కదా! మీ ఇళ్ళకి వెళ్ళి స్నానం చేసి, మంచి బట్టలు ధరించి, భోజనంచేసి పడుకునేటపుడు, ఆ పుష్పచక్రాలని మీ శరీరాల మీద పడేసుకుని నిద్రపోండి. అదృష్టముంటే, రేపు ఉదయానికి మీరు రెడీమేడ్ డెడ్‌బాడీలు అవుతారు." అని ఆ పువ్వుల మీద ఒక బాణం వేస్తూ, ఆ మన్మథుని అల్లుడు బిగ్గరగా నవ్వాడు.

"షట్ యువర్ ట్రాప్... యూ! బ్లడీ ఈడియట్! నీకు తల్లీ, తండ్రీ, తోబుట్టువులు లేరా? మీరందరూ ఏ చెత్తబుట్ట నుంచి పుట్టుకొచ్చారు?" అని సంయమనపు గొలుసు చివరి కొలికి కూడా తెగిపోయిన పరిస్థితిలో అలా ఆక్రోశిస్తూ, ఆ పూల దుకాణంవాడు, ముప్పైరెండు పళ్ళూ బయటపెడుతున్న వాడి అసిస్టెంట్‌ల స్పందన కోసం ఆగకుండా, ఆ భద్రకాళీ అవతారం, ఒక సుడిగాలిలా నిష్క్రమించింది. ఆ సుడిగాలి వెనకాల ఏర్పడి శూన్యం ఆవహించినట్టు, రెండో టీచరు నిశ్శబ్దంగా ఆమెను అనుసరించింది. వారిద్దరినీ ఆ షాపుగుండా గాడిఅంకెలు ఇలా వెంటపెట్టాయి... "ఓ పంతులమ్మలోయ్! మీ స్కూల్లో మీరు ఆ అవయవాన్ని అని నేర్పిస్తున్నారా?"

మరుసటిరోజు, కొన్ని దినపత్రికలలో ఈ సంఘటనకి చిలవలు, పలవలు చేర్చి, ఫోటోలతో సహా వేశారు. చాలామంది పాఠకులకి ఈ వార్త బాగా నచ్చింది. వాళ్ళల్లో కొంతమంది, ఆ ప్రిన్సిపాల్‌కు ఫోన్‌చేసి, ఆమె అకాల మరణం పట్ల సంతాపం, సానుభూతి ప్రకటించారు. ఆమెకి వాళ్ళని నానా దుర్భాషలాడాలనిపించింది. కానీ, అంతకు ముందురోజే, ఆమె తల్లి చనిపోయిన దుఃఖంలో ఉండటం వలన, ఎంతోమంది, భావిభారతపౌరులకు, మార్గదర్శినిగా వ్యవహరించవలసిన బాధ్యత ఆమెకి ఉండటం వలన ఆ కోపానికి ఆమె కళ్ళెం వేసింది.

పుల్లయ్య శారదానాయుడు కళ్ళకి వీలైనంత వరకూ కనిపించకుండా తిరిగాడు, కానీ, ఆమె చేతికి చిక్కినవెంటనే అతన్ని చీల్చి చెండాడటానికి ఆమె వెనుకాడలేదు.

"అమ్మ ఈ రోజుకు స్కూలుకిరారు, ఎందుచేత, అని నేను అడిగేటప్పుడు, అమ్మ చనిపోతే స్కూలుకి వచ్చేదెలా? అని అవతలినుంచి ఒక ఎదురు ప్రశ్న. తరువాత ఫోన్లో మాట్లాడినదంతా మీరే కదా! ఈ విషయంలో ఈ పుల్లయ్యని వేధిస్తే, ఆ ప్రిన్సిపాలమ్మ బదులుగా వీడే చావాల్సి వస్తుంది.